

# హైదరాబాద్ వార్త

# హైదరాబాద్ కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణ

## -కొత్తగా లాఅండ్ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు



**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త**

హైదరాబాదు సిటీ పోలీసు కమిషనరేట్ పునఃవ్యవస్థీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నగర పోలీసు కమిషనరేట్‌ను 35 సంవత్సరాల తర్వాత జి.ఓ.ఎం.ఎస్.నెం.32, (హోం లీగల్ డిపార్టుమెంట్) ద్వారా పోలీసు పునఃవ్యవస్థీకరణ చేయడానికి ఉత్తర్వులు చేశారు. ఈ జివో ప్రకారం రెండు అదనపు లా అండ్ ఆర్డర్ జోన్లు (సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్), 11 కొత్త లాఅండ్ఆర్డర్ డివిజన్లు, ఒకటి అదనపు ట్రాఫిక్ జోన్ (ట్రాఫిక్ 3), మరో 11 లాఅండ్ఆర్డర్ పోలీస్ స్టేషన్లు (మొత్తం 71), 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు (మొత్తం 31) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే నగరంలో ఉన్న 7 జోన్లకు 7 మహిళా పోలీస్ స్టేషన్లతో మహిళా భద్రతా విభాగం, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్, ఐటీ వింగ్, నార్కోటిక్స్ వింగ్ ఏర్పాటు చేశారు. ఈ మార్పుల కోసం అదనంగా 1200 మంది సిబ్బందిని మంజూరు కూడా చేసారు. గత రెండు సంవత్సరాలుగా, పోలీసు స్టేషన్ హద్దులపై అలాగే కొత్త పోలీస్ స్టేషన్లకు వెళ్లడంలో ఎదురు అవుతున్న సమస్యలపై ప్రజల నుండి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసులకు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు కొన్ని ప్రాంతాలలో అధికార పరిధిపై గందరగోళం ఉండటం, సైబర్ క్రైమ్ వింగ్‌ను మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందని హైదరాబాదు సిటీ అధికారులు అందరితో చర్చించి, ప్రభుత్వానికి తెలిపారు. ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మొత్తం హైదరాబాదు సిటీ పోలీసుకు మంజూరైన 17,020 మంది సిబ్బందిని అంతర్గత సర్దుబాటు, పునఃకేటాయింపులు మార్పులతో ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపారు. అందుకు ప్రభుత్వం ప్రతిపాదిత పునఃసర్దుబాటులను జిఓ.నెం.57 (హోం లీగల్ డిపార్టుమెంట్) ద్వారా ఆమోదించింది. ఈ మార్పుల వలన రాబోయే పదేళ్ల వంకు హైదరాబాద్ నగర పోలీసులు బాగా పనిచేయటానికి అనుకూలంగా ఉంటుందని నగర పోలీస్‌కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. ఇక ప్రవేశ పెట్టిన ముఖ్యమైన మార్పుల విషయానికి వస్తే..

**కొత్త లాఅండ్ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు:**

హైదరాబాద్ నగర పోలీసు పరిధిలో 72వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌గా టోలిచౌకి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు ఉన్న ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్, మెహదీపట్నం పోలీస్‌స్టేషన్ (పూర్వం హుమాయున్‌నగర్ పోలీస్‌స్టేషన్), గోల్కొండ పోలీస్‌స్టేషన్‌పరిధిలో ఉన్న కొన్ని ప్రాంతాలను ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చారు.

**డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పేరు మార్పు:**

స్థానిక ప్రజలు తొందరగా గుర్తు పట్టడానికి వారికి అనువుగా ఒకటి లాఅండ్ ఆర్డర్ డివిజన్ పేరు, మూడు లాఅండ ఆర్డర్ పోలీస్ స్టేషన్లకు స్థానికంగా ప్రసిద్ధి చెందిన అలాగే స్థానిక సూచనలను ప్రతిబింబించేలా పేర్లు మార్చారు. గోల్కొండ డివిజన్‌ను ఇప్పుడు టోలిచౌకి డివిజన్ గాను, సెక్రటేరియట్ పిఎస్‌ను లేక్ పిఎస్‌ను, హుమాయున్‌నగర్ పిఎస్ ను మెహదీపట్నం పిఎస్ గాను, షాహినాయత్‌గంజ్ పిఎస్‌ను గోషామహల్ పిఎస్‌గా పేరు మార్చారు.

**ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ..**

లాఅండ్ ఆర్డర్ డివిజన్ల ప్రకారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల హద్దులు ఉండాలని ప్రస్తుతము ఉన్న మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను తీసేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ల పరిధి ప్రకారం వాటికి సంబంధించిన ఏరియాల్లో పనిచేయడానికి ట్రాఫిక్ నాంపల్లి పీఎస్, ట్రాఫిక్ అంబర్‌పేట పిఎస్, ట్రాఫిక్ లంగర్‌హౌస్ పీఎస్, ట్రాఫిక్ బహదూర్‌పుర పీఎస్, ట్రాఫిక్ నల్లకుంట పిఎస్‌ల పేర్లు మార్చి ట్రాఫిక్ గాంధీనగర్ పిఎస్, ట్రాఫిక్ ఉస్మానియా యూనివర్సిటీ పిఎస్,, ట్రాఫిక్ కుల్సుంపుర పిఎస్, ట్రాఫిక్ ఛత్రినాకా పిఎస్, ట్రాఫిక్ సైదాబాద్ పిఎస్‌లుగా పేర్లు మార్చబడ్డాయి.

**మహిళా భద్రతా వింగ్‌ను బలోపేతం చేయడానికి:**

యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏర్పాటు చేసారు. ఇందుకోసం ఒక ఇన్‌స్పెక్టర్, 8 సిబ్బంది ఏర్పాటు చేయగా.. జువెనైల్ బ్యూరో యూనిట్‌కు ఒక ఇన్‌స్పెక్టర్ తో 7మంది సిబ్బంది ఉంటారు అని తెలిపారు. అలాగే ప్రతి లా అండ్ ఆర్డర్ జోన్‌లో ఒక సైబర్ క్రైమ్ సెల్‌ను ఏర్పాటు చేస్తూ అందులో ప్రతి సైబర్ క్రైమ్ సెల్ కు ఒక సబ్‌ఇన్స్పెక్టర్, 5 పోలీస్ కానిస్టేబుళ్లతో సిబ్బంది ఉంటారు. ప్రస్తుత, భవిష్యత్ పోలీసింగ్ అవసరాలకు తగిన విధంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు మంజూరైన సిబ్బంది సంఖ్యతో బలోపేతం చేశారు. పునర్వ్యవస్థీకరణలో జరిగిన మార్పులు అధికార పరిధి పటాలు, సంప్రదింపు, పోలీసు స్టేషన్ వివరాలు, పోలీస్ స్టేషన్ స్థానాలు త్వరలో హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు.

# నాలాలు,వాటర్ డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

## -అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్, జెడ్‌సి హేమంత్‌కేశవ్ పాటిల్ తదితరులు

**హైదరాబాద్,మే 1,ప్రభాతవార్త:**

రానున్న వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు, అసంపూర్తిగా ఉన్న నాలా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం ఎల్బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమీషనర్ నాగోల్ సాయి నగర్ నుండి ఆర్టిఓ ఆఫీస్ వరకు సుమారు 350 మీటర్ల స్టార్మ్ వాటర్ బాక్స్ డ్రెయిన్ పనులు, ఉప్పల్ ఎస్.ఆర్.డి.పి నేషనల్ హైవే ఫ్లైఓవర్ పనులు, బైరామల్ గూడ ఫ్లైఓవర్ కింద బ్లాక్‌లో వివిధ క్రీడలను ప్రోత్సహించేందుకు చేపట్టిన పనులు పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఎల్బీనగర్ జోన్‌లో లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, ఎస్.ఎన్.డి.పి ద్వారా చేపట్టిన నాలా అసంపూర్తి పనులన్నింటిని వచ్చే వర్షాకాలం లోపు పూర్తి చేసేందుకు తగిన అన్ని చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఉన్న నేపథ్యంలో తనకు తెలియజేయాలని సూచించారు. బైరామల్ గూడ ఫ్లైఓవర్ కింద బ్లాక్ లో క్రీడలను ప్రోత్సహించేం దుకు 6 బ్లాక్‌లలో చేపట్టనున్న పనులను పరిశీలించి క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలన్నారు. నాగోల్ సాయి నగర్ నుండి ఆర్‌టిఓ ఆఫీస్ వరకు 350 మీటర్ల వరకు చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. స్టార్మ్ వాటర్ నిర్మాణం వలన ఎన్ని కాలనీలకు ప్రయోజనం కలుగుతుందని కమీషనర్ ఈఈ రమేష్ బాబును వివరణ కోరగా సుమారు 5 కాలనిలో వరద ముంపు నివారణ అవుతుందని వివరించారు. అనంతరం ఉప్పల్ చౌరస్తా వద్ద ఎస్.ఆర్.డి.పి ఫ్లైఓవర్ పనులతో పాటుగా నేషనల్ హైవే నారాపల్లి సిపిఆర్ఐ వరకు చేపట్టిన పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. ఎస్.ఆర్.డి.పి పనుల పూర్తి కాకపోవడానికి గల కారణాలు జోనల్ కమిషనర్ నుండి వివరణ కోరగా. ఫ్లైఓవర్ పనులలో వేరియేషన్ కారణంగా ప్రభుత్వానికి నివేదించినట్లు ప్రభుత్వ అనుమతి రాగానే పనులు చేపట్టడం జరుగుతుందని జెడ్‌సి కమిషనర్ కు వివరించారు. ఈపర్యటనలో కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్ నగర్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్లు తిప్పర్తి యాదయ్య, ఆంజనేయులు, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ ఈఈ లు కార్తీక్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా టెండర్లు పిలవద్దు

## -మేయర్ విజయలక్ష్మీ అధ్యక్షతన కమిటీ తీర్మానం
## -9అంశాలు 2టేబుల్ ఐటెంలకు ఆమోదం
## -రహదారుల విస్తరణపైనే ప్రధానంగా ఫోకస్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, కమిషనర్ ఆర్.వి కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, మే1,ప్రభాతవార్త:**

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధ్యక్షతన గురువారం 2వ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో జరిగింది. జీహెచ్ఎంసీలో వివిధ రహదారుల విస్తరణకు కార్పొరే షన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ సమావేశం లో 9 అంశాలు, 2 టేబుల్ ఐటమ్‌లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ అడిషనల్, జోనల్ కమిషనర్లు ఆయా విభాగాలకు సంబంధించిన టెండర్లు తదితర నిర్ణయలన్నింటిని స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తర్వాతే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆమోదం లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు. బల్దియాకు ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికంగా నిధులు ఇచ్చినందుకు స్టాండింగ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, చంద్ర కాంత్ రెడ్డి, యాదగిరి రావు, సుభద్ర దేవి, అలివేలు మంగతాయారు, నళిని పద్మావతి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, హేమంత్ బోర్కడే, రవికిరణ్, వెంకన్న, సిసిపి శ్రీనివాస్, సి.ఇ లు రత్నాకర్, భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, పాల్గొన్నారు.

**స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు**

-కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేస్2 మెయిన్ రింగ్ 1 మాన్యుఫ్యాక్చర్ సప్లై, డెలివరీ బండ్లగూడ క్రాస్ రోడ్డు నఫీస్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నుండి రాయల్ స్టీల్ ట్రేడర్స్ వరకు పైప్ లైన్ మార్చుటకు, బండ్లగూడ హౌసింగ్ కాలనీ నుండి ఎర్రగుంట వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, యుటిలిటీ మార్చ డానికి రూ. 2.12 కోట్లకు పరిపాలన మంజూరికి కమిటీ ఆమోదం.

-గోపన్ పల్లి విలేజ్‌లో రాంకీ ఫౌండేషన్‌కు సిఎస్ఆర్ కింద అన్ని సౌకర్యా లతో జంతు సంరక్షణ కేంద్రం నిర్మాణం నిర్వహణ కోసం ఇప్పటికే కేటా యించిన 4,350 గజాల స్థలాన్ని, ఆల్ ఫర్ యానిమల్స్ ఫౌండేషన్‌కు వారి నిధులతో అవసరమైన పరికరాలను అమర్చడం, వైద్య సదుపాయాల నిర్వ హణ కొరకు (25) సంవత్సరాల కాలానికి నామమాత్రపు రుసుంతో లీజుకు అనుమతిస్తూ కమిటీ ఆమోదం.

-డబీర్ పుర పోలీస్ స్టేషన్ నుండి నాగబౌలి జంక్షన్ వరకు ప్రతిపాదిత 40 అడుగుల రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ. 5.10 కోట్ల అంచనా వ్యయానికి పరిపాలన మంజూరికి కార్పొరేషన్‌కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.

రోడ్డు నెం.36 వద్ద సుమారు 4వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో బాంబో పా ర్కు అభివృద్ధి, నిర్వహణ, 5373 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ పార్కును సి.ఎస్.ఆర్ కింద అభివృద్ధి, నిర్వహణకు అపోలో హాస్పిటల్ ఎంటర్ప్రైజెస్ లిమిటెడ్ వారికి మూడు సంవత్సరాల కాలానికి ఖైర తాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం.

-రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ కింద తోపు ఖానా మజీద్ నుండి ఉస్మాన్ గంజ్ వరకు ప్రతిపాదిత 18 మీటర్ల రోడ్డు వెడల్పునకు 43 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్ కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం. రోడ్ డెవలప్మెంట్ ప్లాన్‌లో భాగంగా గోషామహల్ నుండి ఉస్మాన్ గంజ్ వరకు ప్రతిపాదిత రహదారి విస్తరణ కోసం 19 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్‌కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.

-రోడ్ డెవలప్మెంట్ ప్లాన్‌లో భాగంగా పోలీస్ ల్యాండ్ నార్త్ వెస్ట్ కార్నర్ నుండి దారుసలాం రహదారి వరకు, మాలకుంట రోడ్డు నుండి ఓల్డ్ తోపు ఖానా రోడ్ వరకు రోడ్డు విస్తరణ కోసం 112 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్ కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.

-బొడెకి కబార్ నుండి బేగం బజార్ వరకు 12 మీటర్లు, 18 మీటర్ల రహదారి విస్తరణకు, రహదారి వెడల్పును 12 మీటర్ల నుండి 18 మీటర్లకు, 200 మీటర్ల పొడవు పెంచుటకు ప్రభుత్వానికి తెలియజేస్తూ 95 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్ కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.

-ఖాజాగూడ జంక్షన్, ఐఐటి జంక్షన్, సైబరాబాద్ సిపి ఆఫీస్ గచ్చిబౌలి వరకు 215 అడుగుల రహదారి విస్తరణ, అభివృద్ధి చేయడం, అట్టి జంక్షన్లలో మల్టీలెవల్ ఫ్లైఓవర్లు, గ్రేడ్ సపరేటర్ల నిర్మాణం, అంజయ్య నగర్ నుండి రాంకీ టవర్ రోడ్డు వరకు 150 అడుగల రహదారి విస్తరణ అభివృద్ధికి రూ. 749 కోట్ల ప్రాజెక్టుకు ఇ.పి.సి కింద టెండర్లు పిలవడానికి కమిటీ ఆమోదం.

**టేబుల్ ఐటమ్స్ :**

రూ. 2.95 కోట్ల అంచనా వ్యయంతో సికింద్రాబాద్ సర్కిల్ బౌద్ధ నగర్ లో సి.సి రోడ్డు పునరుద్ధరణతో పాటు రోడ్డుకు ఇరువైపులా బాక్స్ డ్రెయిన్ పున రుద్దరణ పనులు, సెయింట్ అల్బాన్స్ స్కూల్ వద్ద ఆర్.సి.సి బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి కమిటీ ఆమోదం. అలాగే ఈ.ఈ.ఎస్.ఎల్ ఏజెన్సీ ఎల్.ఇ.డి స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ కాం ట్రాక్టు ఏప్రిల్ 30 తో పూర్తి అయినందున, కొత్త ఏజెన్సీ ఫైనలైజ్ అయ్యే వరకు లేదా రెండు నెలల పాటు ప్రత్యామ్నాయంగా ఈ.ఈ.ఎస్.ఎల్ ఏజెన్సీ స్ట్రీట్ లైటింగ్ నిర్వహించుటకు కమిటీ ఆమోదం.

# మాయాలోకం 'సామాజిక మాధ్యమం'

## వ్యూస్, లైక్స్‌లకై యువత ఆరాటం / మంచి, చెడు తెలియని దుస్థితి



**హైదరాబాద్,మే1, ప్రభాతవార్త:**

రైలుకు ఎదురెళ్లి ప్రమాదకర రీల్స్ లు..బూతుల సంభాషనలతో చెత్త వీడియోలు..అందాలను ఆరబోస్తూ అమ్మాయిలు.. ప్రముఖులపై అసత్య ప్రచారాలు ఇలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. మంచి,చెడుకు వ్యత్యాసాలు తెలుసుకోలేని విధంగా యువత ఆకర్షితులవుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని క్రమక్రమంగా విస్తరించడంతో మానవసంబంధాలను ఏకం చేయడం.. వ్యాపారాభివృద్ధికై ఆలోచనలు పంచుకొని అభివృద్ధికి తోడ్పాటు అందాల్సిన సామాజికమాధ్యమాలు పరువు, ప్రతిష్ట, ప్రాణాలకు దారి తీస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేదికలను కట్టడి చేయలేమని తేల్చి చెప్పుతున్నారు. పిచ్చి ప్రయత్నాలు, ప్రేలాపనల పోస్టులకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని నగర పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**అసభ్యకర పోస్టులు..పొగరెక్కిన 'ట్రోల్స్'**

సమాజంలో రీల్స్ హీరో...యూట్యూబ్ స్టార్‌లాంటి వంటి పాపులర్ కావడం కోసం యువత ప్రాణాలను పణంగా పెట్టి వీడియోలు చేస్తున్నారు. ప్రమాదపు అంచున వరకు వెళ్లి వస్తున్నారు. రైలు పట్టాలపై పడుకున్న రీల్స్‌ను మార్ఫింగ్ చేసి దాన్ని కింద పడుకొని సాహసం చేసినట్లు సోషల్ మీడియాలో పెట్టి లైక్‌ల కోసం ఆరాటపడుతున్నారు. మరికొందరూ పచ్చి బూతూల సంభాషనలతో పోస్టు చేసి కామెంట్లకు వేచి చూస్తున్నారు. ఇక కొంతమంది అమ్మాయిలు, మహిళలు సైతం అందాలను పబ్లిక్‌లో పెట్టి కుర్రకారులతో డబ్బులను వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కటేంటి ప్రతిదీ రహస్యం, బహిరంగం అనే తేడా లేకుండా బానిసై మతిభ్రమించి కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఇంట్లో తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు సమాజంలో పరువు గురించి ఆలోచించకుండా అదే లోకమై జీవిస్తున్నారు యువత. మరికొందరూ ప్రముఖులను టార్గెట్ చేస్తూ సినిమా హీరోలు, రాజకీయ నేతల పోస్టులకు వ్యంగంగా ట్రోల్స్ చేసి పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారు. వాస్తవాలే తెలియకుండా నోటి దురుసుతో ఇష్టారాజ్యంగా కామెంట్లు పెడుతూ సరదాలను తీర్చుకుంటున్నారు. ఇలాంటి వాటిపై ఎవరైన ఫిర్యాదు చేస్తే ఆకతాయిలపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టి జైలుకు పంపిస్తున్నారు.

**ఇక మోసాలు..వేధింపులు సైతం**

సోషల్ మీడియాలో మరికొందరు వ్యాపారాల ప్రచారాలకు వాడుతున్నారు. ఇందులో వాస్తవాలను తెలుసుకోకపోతే మోసపోక తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొందరు నకిలీ సంస్థలు ఏర్పాటు చేసుకొని బహిరంగ మార్కెట్లో రూ.వేలల్లో ఉన్న వస్తువులు అతి తక్కువ ధరలతో ట్యాగ్ చేస్తూ వినియోగదారులను నమ్మిస్తున్నారు. నిజమని గ్రహించిన మరికొందరు మోసపోయామని చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ కలాపాలతో బ్యాంకు వివరాలను రాబట్టి రూ.కోట్లు కొల్లగొట్టిన సైబర్‌క్రైం జరిగే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ పరిచయాలతో వేధింపులు చోటు చేసుకుంటున్నాయి. తీపిమాటలు,పరిచయాలతో ఫోన్ నెంబర్ల మార్పు, పరస్పర కలయికలతో నమ్మించి ప్రేమలంటూ వెంటపడి అన్ని తెలుసుకొని వ్యక్తిగత ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేసి వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో ఎంతోమంది అమాయక యువత ఎవరికి చెప్పుకోలేక ప్రాణాలను తీసుకుంటున్న ఘటనలు ఉన్నాయి. అక్కడో ఇక్కడ ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇలాంటి విషయాలు వెలుగుచూస్తున్నాయి.

**సోషల్ మీడియాపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం**

**- కె. బ్రహ్మిణి, సామాజిక విశ్లేషకురాలు**

సోషల్‌మీడియా వాడుతున్న యువతపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. సమాజంలో మంచి, చెడు తెలియకుండా సాగుతున్న తరుణంలో కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. టీనేజ్ వయస్సులో చెడుయే ఎక్కువ ఆకర్షిస్తుంది. ఇప్పుడే కట్టడి చేయకపోతే భవిష్యత్తు మరింత ప్రమాదంలో పడుతుంది. అన్నివర్గాలకు ఉపయోగపడే వేదికలో మంచి, చెడును గ్రహించి పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉంది.

# మొరాయించిన మెట్రో రైల్..!

## -మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో సాంకేతిక సమస్య
## -భరత్‌నగర్ సమీపంలో 20 నిమిషాలు ఆగిపోయిన రైలు

**హైదరాబాద్,మే 1 ప్రభాతవార్త**

నగర ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యాన్ని అందిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు సేవలకు అంతరాయం కలిగింది. అత్యంత రద్దీగా ఉండే మియాపూర్-ఎల్బీనగర్ కారిడార్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఒక మెట్రో రైలు మార్గమధ్యంలో నిలిచిపోయింది. ఈ సంఘటనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.వివరాల్లోకి వెళితే, మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వైపు వెళుతున్న మెట్రో రైలులో సాంకేతిక సమస్య తలెత్తింది. దీని కారణంగా రైలు భరత్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో సుమారు 20 నిమిషాల పాటు నిలిచిపోయింది. గురువారం మధ్యాహనం 4.30 గంటల సమయంలో ఈ సమస్య తలెత్తింది.రైలు ఆగిపోవడంతో ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు కొంత ఆందోళనకు గురయ్యారు.ఎంతసేపటికీ రైలు కదలకపోవటంతో కొంత మంది ప్రయాణికులు బయటకు వచ్చి బస్సుల్లో వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే హైదరాబాద్ మెట్రో రైల్ సాంకేతిక సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతు చర్యలు చేపట్టారు. దాదాపు 20 నిమిషాల పాటు శ్రమించి సాంకేతిక సమస్యను పరిష్కరించారు. అనంతరం రైలు యధావిధిగా బయలుదేరి వెళ్ళింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిజెపి : ఎమ్మెల్యే శ్రీగణేష్




ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, మే 1 ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక, దళిత వ్యతిరేక విధానాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ పాదయాత్ర వార్డ్ 5 కార్యక్రమ ఇంచార్జ్ పెద్దల నరసింహ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ లోని వార్డు 5, మహాత్మాగాంధీ నగర్ నుంచి దుర్గయ్య గార్డెన్, హనుమంతరావు గార్డెన్, గణేష్ నగర్, ఓల్డ్ సంజీవయ్య నగర్, సెకండ్ లక్ష్మీ నగర్ మీదుగా సంజీవయ్య నగర్, వీకర్ సెక్షన్ పార్క్ అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలి సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్యక్రమ కోఆర్డినేటర్ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాతతో పాటు వార్డు 5 కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బిజెపి పార్టీ దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఎమ్మెల్యే విమర్శించారు. కంటోన్మెంట్ బోర్డ్ ఎన్నికలు ప్రతి 5 ఏళ్లకు ఒక సారి జరగాల్సి ఉందని, 2015 ఎన్నికల తరువాత 2020 ఫిబ్రవరిలో మళ్లీ ఎన్నికలు జరగాలని, కాని 5 ఏళ్లు గడిచిపోయి 2025 వచ్చినా కేంద్రం ఎన్నికలు జరపకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు కాలపరిమితి దాటిపోయి 5 ఏళ్లయినా కూడా ఎన్నికలు జరపకుండా నామినేటెడ్ సభ్యులతో పబ్బం గడుపుతున్నారని, ప్రజా ప్రతినిధులు లేక, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. అందుకే బిజెపి రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

# హైడ్రా ముసుగులో పేదరైతుల ఉసురు పోసుకుంటున్న రేవంత్ ప్రభుత్వం...

## -ఎఫ్‌టిఎల్ పేరుతో రైతుల పట్టా భూములను లాక్కోవడానికి నీఅబ్బ జాగీరా అంటూ ఎంపి ఈటల ఘాటైన వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 1, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హైడ్రాను తీసుకువచ్చి పేద మధ్యతరగతి ప్రజలు, రైతుల ఉసురుపోసుకుంటుందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఆరోపించారు. గురువారం కూకట్పల్లి నల్ల చెరువును బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్రావు, మాధవరం కాంతారావులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము చెరువుల అభివృద్ధికి గాని, మూసీ ప్రక్షాళనకు గాని వ్యతిరేకం కాదని, చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని అన్నారు. పేదల బాధలు పట్టించుకోకుండా తమ అబ్బ జాగీర్ అన్నట్లుగా పట్టాదారుల భూములను దౌర్జన్యంగా లాక్కుంటామంటే చూస్తూ ఉరుకునే ప్రసక్తేలేదని ఈటెల రాజేందర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కూకట్పల్లి నల్ల చెరువు శిఖం భూమి 7.36 ఎకరాలైతే, ఎఫ్‌టిఎల్ పరిధి మాత్రం 22 ఎకరాల వ్యవసాయ పట్టాభూముల్లో విస్తరించి ఉందని పేర్కొన్నారు. వందల ఏళ్ళ క్రితం నుంచి వ్యవసాయం చేసుకుంటూ పూర్తి స్థాయి పట్టాహక్కులు కలిగిన ఉన్న రైతులతో సంప్రదించి, చట్టబద్దంగా వారికి ఇవ్వాల్సిన నష్ట పరిహారం ఏ రూపంలో ఇస్తారో స్పష్టం చేయకుండా పోలీసుల పహార పెట్టి బుల్డోజర్లతో గెదెలు, ఆవుల కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్లను తొలగించి మరీ బావులు తవ్వినట్లు మట్టి తీయడేమిటని ప్రశ్నించారు. హైడ్రా అధికారులను పలు మార్లు కలిసి విన్నవించినా పట్టించుకోకపోవడంతో పట్టాదారులైన రైతులు హైకోర్టును ఆశ్రయించారని, పూర్తి విచారణ జరిపిన రాష్ట అత్యున్నత న్యాయస్థానం రైతుల పట్టా భూముల్లో ఎలాంటి చర్యలు చేపట్టకూడదని, జేసీబీలు, బుల్డోజర్లతో ఎలాంటి తవ్వకాలు చేపట్టవదని, ప్రస్తుతం చేపడుతున్న పనులను నిలిపివేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోకుండా అధికారులు పనులు చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిన్నర కాలంలో అనేక మార్లు సుప్రింకోర్టు, హైకోర్టు ప్రభుత్వానికి, ప్రభుత్వ అధినేతకు మొట్టికాయలు వేసినా, చివాట్లు పెట్టినా కోర్టులు అంటే లెక్కలేనట్లు వ్యవహరిస్తూ నియంతృత్వం పాలన సాగిస్తారా అని ఎంపీ ఈటెల రాజేందర్ నిలదీశారు. హైడ్రా అరాచకాలపై ప్రజలు, కోర్టులు తిరగబడే సరికి తోకముడిచి దొడ్డిదారి వ్యవహారాలు నడిపిస్తుందని, హైడ్రా ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందో సమాజానికి అర్థమైందని ఈటెల రాజేందర్ ఆరోపించారు. ఏడాది కాలంలో పేదల ఉసురుపోసుకోవడం తప్ప హైడ్రా ఉద్ధరించిందేమిటో చెప్పాలన్నారు. జనాభా గణనతోపాటు బీసీ గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారని, ఇది చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నల్లచెరువుల పట్టాదారులైన రైతులతోపాటు బీజీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల వడ్డేపల్లి రాజేశ్వర్రావు, కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జి మాధవరం కాంతారావు, కన్వీనర్ జి. శ్రీకరరావు, అర్శనపల్లి సూర్యారావు పాల్గొన్నారు.

## కులగణనకు రోల్ మోడల్ తెలంగాణ

**-తెలంగాణ బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీకాంత్‌గౌడ్**

**ముషీరాబాద్, మే1, ప్రభాతవార్త:** కుల గణనకు రోల్ మోడల్ తెలంగాణ అని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ కొనియాడారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆచరిస్తూ ఉంటే కేంద్ర ప్రభుత్వం దానిని అనుసరిస్తోందని అన్నారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ కులగణన ఆవశ్యకతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లారని తెలిపారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితోనే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. రాహుల్‌గాంధీ ఎత్తుకున్న కులగణన అంశం ప్రజల్లోకి వెళ్లటంతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి, కులగణన చేస్తామని ప్రకటించిందని, మహారాష్ట్ర ఎన్నికల సమయంలో కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడిన మోదీ ఇప్పుడు కులగణనపై నిర్ణయం తీసుకున్నారనంటే అది రాహుల్‌గాంధీ విజయంగా భావించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో కులగణన లోపభూయిష్టంగా ఉందంటూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు.

## పేదలకు సంజీవని సిఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే ముఠా గోపాల్


లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, మే 1 ప్రభాతవార్త:**
పేదలకు సంజీవని సిఎంఆర్ఎఫ్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న 20 మంది లబ్దిదారులకు రూ.6,49లక్షల500 చెక్కులను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులఉ ఎం.రాకేష్ కుమార్, వల్లాల శ్యామ్ యాదవ్, శంకర్ ముదిరాజ్, కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు, ముఠా నరేష్, మీడియా ఇంచార్జ్ ముచ్చ కుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి, పూన్న సత్యనారాయణ, ఖలీల్, శ్రీహరి, కుమారస్వామి, నర్సింగ్, సత్తి ,యాదగిరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రఘురామ్‌రెడ్డి


లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.రఘురాంరెడ్డి నియమితులైన సందర్భంగా సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 1 ప్రభాతవార్త:** లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ప్రముఖ న్యాయవాది కె.రఘురాం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా మూడవసారి ఎన్నిక కావడం విశేషం. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.మధుసూదన్ తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డి. విలాస్, కోశాధికారిగా ఎం. కిరణ్ కుమార్ యాదవ్‌తో పాటు కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలిగా రవియా బేగం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నిర్మల్ కుమార్ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యులు జి. రామారావు, ఫణీంద్ర భార్గవ్‌ల సమక్షంలో జరిగాయి. ఎన్నికలు జరిగాయి.

## సన్నబియ్యం పథకం ఎంతో మందికి లబ్ది : డిప్యూటీ మేయర్



తెల్లకార్డు దారులకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ దంపతులు

**తార్నాక, మే 1 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకంలో భాగంగా గురువారం గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి తార్నాకలోని చింతల్ బస్తి వద్ద రేషన్ శాపులో ప్రారంభించి బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, సన్నబియ్యం పంపిణీ పథకం పేదల ఆరోగ్యం కోసం చిత్తశుద్ధితో రూపొందించిందన్నారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు పోషకాలు సమృద్ధిగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసం పలు ప్రయోజనకరమైన పథకాలను చేపడుతోంది. ఇందులో భాగంగా సన్నబియ్యం పథకంతో పాటు పేదలకు ఉచిత విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఈ పథకాలు సామాజిక న్యాయం లక్ష్యంగా ఉంచుకొని ప్రజలకు మేలు చేయాలని సంకల్పించిందన్నారు.

## యోగాతోనే ఆరోగ్యం: తేళ్ల బాల్ రాజ్


యోగాపై అవగాహన కల్పిస్తున్న అధ్యక్షులు తేళ్ల బాల్‌రాజ్

**తార్నాక, మే 1 ప్రభాతవార్త :** యోగాను నిరంతరం సాధన చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఆయుర్ ఆరోగ్య రహస్య మెడిటేషన్ యోగా (ఏఏఆర్ఎంవై) రీసర్చ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తేళ్ల బాల్ రాజ్ అన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ఆర్య సమాజ్‌లో ఏఏఆర్ఎంవై ఆవిర్భావ సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తేళ్ల బాల్ రాజ్ మాట్లాడుతూ ఏఏఆర్ఎంవై లక్ష్యాలను ప్రకటించారు. యోగా శిక్షకుడిగా తనకు ఉన్న అరవై ఏళ్ల అనుభవం గురించి వివరించారు. వీధి వీధికీ, వాడవాడకీ యోగా గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఆ దిశగా తాము కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆర్య సమాజ్ ప్రాంగణంలో ఉదయం ఐదున్నర గంటల నుంచి రెండు గంటలపాటు ప్రతిరోజు ఉచిత యోగా శిక్షణ అందజేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 60 ఏళ్ల నుంచి ఇది కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాంతో పాటు తమ సంస్థ తరఫున యోగా టీచర్ ట్రైనింగ్ కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏఆర్ఎంవై ప్రతినిధులు కస్టమ్స్ మాజీ కమిషనర్ మంగబాబు, సహజ డెవలపర్స్ డైరెక్టర్ ప్రసన్న, డాక్టర్ రామకోటేశ్వరరావు (ఆర్కేచౌదరి) తదితరులు పాల్గొన్నారు.


బోయిన్‌పల్లి చౌరస్తాలో మేడే సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు జంపనప్రతాప్, ముప్పిడి మధుకర్ తదితరులు


అడ్డగుట్టలో మేడే జెండాను ఎగరవేస్తున్న ఎం.సి.పి.ఐ.యు నేతలు


మోండా డివిజన్‌లో మేడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని


జెబిఎస్ వద్ద మేడే జెండాను ఎగరవేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, ఏఐటీయూసి నేత నర్సింహ్మా తదితరులు


మే డే సందర్భంగా రామకృష్ణ స్ట్రీట్‌లో కాలనీలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న పురేందర్ రెడ్డి,రామచంద్ర రావు



మేడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద


మే డే సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న చింతల నాగరాజు


గండిమైసమ్మ, గ్లాండ్ ఫార్మా కంపెనీలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న శ్రీశైలంగౌడ్


అల్వాల్ పట్టణ పరిధిలో జరిగిన మే డే సందర్భంగా కార్మికులుతో డిసి శ్రీనివాస్ రెడ్డి


వి ఎస్ టి యూనియన్ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ, వి ఎస్ టి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి. సంజీవ రెడ్డి


మేడే వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ దంపతులు, కార్మికులు


ఖానాపూర్‌లో మేడే ఉత్సవాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

# నగరంలో ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

## కూకట్‌పల్లి నల్లచెరువు పట్టా భూముల్లో మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి

**-హైడ్రాకు ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర హైకోర్టు..**

**కెపిహెచ్బి కాలనీ, మే 1, ప్రభాతవార్త:**
కూకట్పల్లి నల్ల చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోని భూమిపై యాజమాన్య హక్కులు కలిగిన పట్టాదారులకు నష్టపరి హారం చెల్లించకుండా చేపడుతున్న పనులను నిలిపివేయాలని హైడ్రాకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కూకట్పల్లి గ్రామ సర్వే నెంబరు 27 నుంచి 80 వరకు పట్టా భూములు ఉన్నాయి. 7.38 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగతాది పట్టా భూముల్లో నల్ల చెరువు ఎఫ్‌టిఎల్ విస్తరించి ఉంది. చెరువు చుట్టుపక్కల ఉన్న 22 ఎకరాల పట్టాభూమి అనాదిగా పూర్తి యాజమాన్యపు (వ్యవసాయ పట్టా) హక్కులతో రైతులు వ్యవసాయం, అనుబంధ పాడి, కూరగాయాలు సాగు చేసుకుంటూ భూ ములను జీవనోపాధిగా మార్చుకున్నారు. అర్బనైజేషన్లో భాగంగా కూకట్‌పల్లి ప్రాంతం కాంక్రీట్ జింగిల్‌గామారడంతో వ్యవసాయం కనుమరుగైనా పాడి కోసం గెదెలు, ఆవుల షెడ్లు, పాకలు వేసుకుని భూమిని కాపాడుకుంటు వస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల నల్ల చెరువును అభివృద్ధి చేయడానికి హైడ్రా అధికారులు శ్రీకారం చుట్టారు. ఎఫ్‌టిఎల్ పరిధిని శాస్త్రీయబద్ధంగా నిర్ధారించడంతోపాటు భూములకు చట్టబద్ధంగా నష్టపరిహారం అందించాలని పలు మార్లు హైడ్రా ధికారులను కలిసి విన్నవించారు. అయినా పట్టించుకోకుండా పట్టా భూముల్లో గత కొద్ది రోజులుగా హైడ్రా అధికారులు మట్టి తీసే పనులు చేపడుతున్నారు. సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం పట్టా భూములు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నా నష్టపరిహారం చెల్లించాల్సిందే నన్న స్పష్టమైన విధానం ఉన్న అందుకు విరుద్ధంగా హైడ్రా వ్యవహరిస్తుండటంతో పట్టాదారులు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ అంశంపై పూర్తి విచారణ జరిపిన రాష్ట్ర హై కోర్టు పట్టాదారుల భూముల్లో చేపడుతున్న మట్టి తవ్వకాలను నిలిపివేయాలని, నాట్ టూ ఇంటర్ ఫియర్ అని హైడ్రాను ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**హైకోర్టు ఆదేశించినా కొనసాగుతున్న పనులు...**
పట్టాభూముల్లో చెరువు పూడిక తీత పేరుతో హైడ్రా చేపడుతున్న తవ్వకాలను నిలిపివేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు అవేమి పట్టించుకోకుండా పోలీసుల పహార మధ్య పనులు చేస్తున్నారని పట్టాదారులు ఆరోపించారు. హైడ్రా అధికారులకు హై కోర్టు ఉత్తర్వుల కాపీని అందజేయడం జరిగిందని కాని పట్టించుకోకుండా తమ భూముల్లో పనులు చేపడుతున్నారని వాపోయారు. పనులను నిలిపివేసి తమకు పరిహారం ఏ రూపంలో ఇస్తారో స్పష్టం చేసిన తరువాత అభివృద్ధి పనులు చేసుకుంటే తమకు అ భ్యంతరం లేదని వారు స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల ను ధిక్కరించి పనులను ఇలాగే కొనసాగిస్తే మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని పట్టాదారులు హెచ్చరించారు.

## సిగరేట్ తాగడం యువతకు ఫ్యాషన్‌గా మారింది

**-గాంధీ ఆసుపత్రి హెచ్‌వోడి ప్రొ.డా.కెటి రెడ్డి**

**హైదరాబాద్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:**
పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్ సంక్రమిస్తుందని ప్రజలను చైతన్య పరుస్తూ దశాబ్దాలుగా డాక్టర్ ఒ. నాగేశ్వరరావు చేస్తున్న కృషి అభినందనీయమని గాంధీ దవాఖాన పరిపాలన హెచ్‌వోడి ప్రొఫెసర్ డాక్టర్ కె.టి.రెడ్డి అన్నారు. డాక్టర్. ఒ.ఎన్.రావు చారిటబుల్ ట్రస్టు, డాక్టర్. రాప్స్ ఒరల్ హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 31 వరకు ఖినో టొబాకో మంత్‌ఖి నిర్వహించనున్న సందర్భంగా గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వాల చర్యలు, అవగాహన కార్యక్రమాల ఫలితంగా గతంలో ఉన్నంతగా పొగాకు వాడకం ఇప్పుడు లేదన్నారు. అయితే, కొంతమంది సినిమాల్లో చూసి సిగరెట్టాగడం ఫ్యాషన్‌గా మార్చుకొన్నారని తెలిపారు. బీడి, సిగరెట్, చుట్ట, గుట్కా వాడకంతో అనేక రకాల క్యాన్సర్లు వస్తాయన్నారు. డాక్టర్.ఒ.ఎన్.రావు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డా.ఒ. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెలంతా పొగాకు వాడకంపై కలిగే దుష్ప్రయోజనాల గురించి ఈ నెలంతా అవహన



పొగాకు నిర్మూలన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డా.నాగేశ్వర్‌రావు, కె.టిరెడ్డి, మోహన్, వింధ్య, చిటిబాబు తదితరులు

కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రైతులు పొగా పంట ఉత్పత్తులను తగ్గించి, వాణిజ్య పంటలను సాగు చేయాలని, దీంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వాడే వారి పై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అంకాలజిస్టు డా. వింధ్య వాసిని, ఏపిఎస్ఆర్టిసి హాస్పిటల్ ఇఎన్‌టి సర్జన్ డాక్టర్. ఐ. చిట్టిబాబు, సినీ మ్యూ జిక్ డైరెక్టర్ బల్లెపల్లి మోహన్ పొగాకు వాడితే కలిగే దుష్ప్రయోజనాల గురించి వివరించారు.అనంతరం పొగాకు నిర్మూలనపై రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు. ఆతర్వాత అతిధులందరికీ ఒ.నాగేశ్వర్‌రావు మెమెంటోలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

## కేంద్రం కులగణన నిర్ణయం హర్షణీయం : చంద్రశేఖర్ గౌడ్

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:**
దేశవ్యాప్త జనగణనలో భాగంగా సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్ర కాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఇది బీసీ ల ఏళ్లనాటి పోరాట ఫలితమని ఎఈ తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఈమేరకు గురువారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యే క ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ తో జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏప్రిల్2 వ తేదీన ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించిన విషయాని గుర్తు చేశారు. ఈకార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి హాజరు అయ్యి మద్దతు తెలపడం, సమస్య తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆ ఒత్తిడి మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించడానికి దోహద పడిందని అభిప్రాయ పడుతున్నామన్నారు. అంతే కాకుండా తెలంగాణ,బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్, రమా తదితరులు

ఇప్పటికే్ల సమగ్ర కులగణన ప్రక్రియ ను చేపట్టడం కూడా కేంద్రం ప్రభుత్వం పై మరింత ఒత్తిడి పెరిగిందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్స్ పై విధించిన 50 శాతం సీలింగ్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ తెలంగాణ లో బీసీ జనాభాకు అనుకూలంగా రాష్ట్ర బ్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించి అమలు చెయ్యాలని,దేశవ్యాప్తంగా కులగణన పూర్తయిన తర్వాత వెల్లడయ్యే గణాంకాల ప్రకారం బీసీ రిజర్వేషన్స్ ఖరారు చేసి అమలు చేయాలని పేర్కొన్నారు.

## కష్టపడి ఇష్టపడి చదివితే ఫలితాలు సాధించడం సులభతరం


ప్రసంగిస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే, బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వివేక్ వెంకటస్వామి,

**చిక్కడపల్లి, మే 1 ప్రభాతవార్త:**
కష్టపడి ఇష్టపడి చదివితే ఫలితాలు సాధించడం సులభతరం అవుతుందని చెన్నూరు ఎమ్మెల్యే, బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వివేక్ వెంకటస్వామి, కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హైస్కూల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులందరూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణులైన వారిని యాజమాన్యం ఘనంగా సత్కరించింది. 10వ తరగతి బోర్డు పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్నాను. ఈ పరీక్షలో గట్టి కష్టపడి, ఉత్తమ ఫలితాలను సాధించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. లక్ష్యాలను సాధించడానికి ఈ విజయాలు మీకు మార్గదర్శకాలుగా ఉండాలన్నారు. సమాజానికి, దేశానికి సేవ చేయాలని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ పై చదువులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ పి వి రమణ రావు కూడా పాల్గొన్నారు.

**శ్రీపట్టాభి రామచంద్ర ఆలయానికి విరాళాలు అందజేత**

**కెపిహెచ్బి కాలనీ, మే 1, ప్రభాతవార్త:**
కూకట్పల్లిలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో వెలియనున్న శ్రీ ఆంజనేయ స్వామి గరుత్మంతుడు స్వామి వార్ల విగ్రహాల కోసం కూకట్పల్లి వాస్తవ్యులు మాధవరం శివయ్య గారి బయమ్మ ఒక్క లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావుకు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ తులసిరావు, వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి, మాజీ కార్పొరేటర్ రంగారావు, కమిటీ సభ్యులు మర్యాద అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**డిసిఎస్ఓ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన రేషన్ డీలర్లు..**


డిసిఎస్ఓ శ్రీనివాస్ రెడ్డితో రేషన్ డీలర్లు

**కెపిహెచ్బి కాలనీ, మే 1, ప్రభాతవార్త:**
మొదటిసారి బాలానగర్ సర్కిల్ ఏసిఎస్ఓ కార్యాలయానికి డిసిఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి విచ్చేసిన శుభ సందర్భంగా కూకట్పల్లి కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసారు.

**ప్రోటోకాల్‌కు విరుద్ధంగా ఉందని శిలాఫలకం ధ్వంసం**

**-బిజెపి కార్పొరేటర్ లచ్చిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాసరెడ్డిపై కేసు**

**వనస్థలిపురం, మే1,ప్రభాతవార్త:**
ఎల్బీనగర్ నియోజకవర్గం బి.యన్ రెడ్డి డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ గ్రంథాలయ భవన నిర్మాణానికి గురువారం ఉదయం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డిలు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన శిలాఫలకం ప్రోటోకాల్ కు విరుద్ధంగా ఉందని మధ్యాహ్నం రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మరి కొంతమంది బిజెపి నేతలు ధ్వంసం చేశారు.,మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పేరు ప్రోటోకాల్ విరుద్ధంగా చిన్నగా పెట్టారని బిజెపి కార్యకర్తలు మధ్యాహ్నం ధ్వంసం చేసారు. కార్పొరేటర్ లచ్చిరెడ్డి వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మరికొందరు బిజెపి నేతలపై లైబ్రేరియన్ పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## దేశవ్యాప్తంగా కులగణన బిసిల పోరాట విజయం

**-బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్**

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:**
దేశవ్యాప్తంగా కులగలన జరపడం బీసీల విజయం అన్నారు బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్. సోమవారం ఉదయం సోమాజిగూడ లో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ విజిఆర్ నారగోని, సాలూరి రామకృష్ణ గారితో కలిసి ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల రాజీలేని పోరాటంతోనే బీసీ వ్యతిరేకి బిజెపి కులగణన నిర్వహించేందుకు ముందుకు వచ్చిందని రాజారామ్ యాదవ్ అన్నారు. కులగణన నిర్వహించడంతోపాటు జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని రాజారామ్ యాదవ్ కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బీసీల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఏ మాత్రం బాధ్యత ఉన్న చట్టసభల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించి తక్షణమే అమలు చేయాలని ప్రధానమంత్రి మోడీని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ పైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే కులగణన ప్రకారం బీసీలకు విద్యా ఉద్యోగ రంగాలతోపాటు స్థానిక సంస్థల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రేవంత్ రెడ్డిని రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు.

## బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం


బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పండితులు సత్యనారాయణ,న్యూ మోడల్‌విద్యా సంస్థల డైరెక్టర్ మహ్మద్ ఖలీల్ ఉర్ రెహ్మాన్,ఫాస్టర్,న్యాయవాది సుధారాణి, ఆశ్రిత డైరెక్టర్ నాగరాజు,వి.పర్వతాలు తదితరులు

**మైలార్‌దేవ్‌పల్లి,మే 1 ప్రభాతవార్త :**
బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని,బాల్య వివాహాలను అడ్డు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని పండితులు సత్యనారాయణ,న్యూ మోడల్ విద్యా సంస్థల డైరెక్టర్ మహ్మద్ ఖలీల్ ఉర్ రెహ్మాన్,న్యాయవాది ఫాస్టర్ సుధారాణిలు అన్నారు.పాతబస్తీ ఆశ్రిత్‌లో గురువారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమంలో వివిధ మతాలు చెందిన మత పెద్దలు పాల్గొన్నారు.బాల్య వివాహాలకు వ్యతిరేకంగా రూపొందించిన బ్రోచర్‌నువిడుదల చేశారు.ఈ సందర్భంగా పండితులు సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహం బాలికలకు శాపమని, చదువుతోనే గౌరవం లభిస్తుందని బాలికలు కష్టపడి చదువుకోవాలని తెలిపారు.ఫాస్టర్,న్యాయవాది సుధారాణి మాట్లాడుతూ మన దేశంలో బాల్య వివాహాలు 1929లో రద్దు చేయ బడ్డాయని,బాల్య వివాహాలు జరపటం చట్ట రీత్యా నేరమవుతుందని తెలియజేశారు.బాల్య వివాహాలపై ప్రజలలో చైతన్యం కల్పించ వలసిన అవసరం ఉందని,బాలికలు మంచిపట్టుదలతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆమె తెలిపారు.న్యూ మోడల్ విద్యా సంస్థల డైరెక్టర్ మహ్మద్ ఖలీల్ ఉర్ రెహ్మాన్ మాట్లాడుతూ బాలికలు కనీసం డిగ్రీ వరకు చదువు కోవాలని నేడు, అన్ని రంగాలలోను బాలికలు రాణిస్తున్నారని తెలియజేశారు.కాగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ్రిత డైరెక్టర్ నాగరాజు,విద్యావేత్త శ్రావణ్ కుమార్,వి.పర్వతాలు,బి.శ్యాంసుందర్,శేఖర్‌తో పాటు బాలికలు పాల్గొన్నారు..

## హోంగార్డును దుర్భాషలాడిన బైకర్‌పై కేసు నమోదు

**నార్సింగి, మే 1 ప్రభాతవార్త :**
విధులలో ఉన్న ట్రాఫిక్ హోంగార్డును దుర్భాషలాడిన ద్విచక్రవాహనదారుడిపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం పీరంచెరువు ప్రాంతానికి చెందిన షేక్ రహ్మతుల్లా(39) నార్సింగి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడు విధులలో భాగంగా ఏప్రిల్ 29.వ,తేదీన బండ్లగూడ చౌరస్తాలో పని చేస్తున్నాడు. వెస్టర్న్ కాలనీ నుంచి మేయిన్ రోడ్డుపైకి వేగంగా అవేంజర్(ఎపి 09సిఎల్ 9403)పై దూసుకు వచ్చింది. దీంతో హోంగార్డు ఆ ద్విచక్రవాహనంను ఆపాడు. భారీ వాహనాలు వస్తున్నాయని, బైక్‌ను పక్క నుంచి వెళ్లాలని సూచించాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన సదరు ద్విచక్రవాహనదారుడు పోలీసు కమీషనర్ సీవి.ఆనంద్ సార్‌కు ఫోన్ చేసి నీపై కేసు పెట్టిస్తా, అంటూ నోటికి వచ్చినట్లు దూషించాడు. ఆపై అతడి కొడుకు సైతం హోంగార్డుపై అసభ్య పదజాలంతో దూషించాడు. విధులలో ఉన్న హోంగార్డును అడ్డుకోవడం, దూషించడం వంటి నేరాలకు పాల్పడిన సదరు ద్విచక్రవాహనదారులపై కేసు పెట్టాలని కోరుతూ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం: కార్పొరేటర్ జితేందర్‌నాథ్



రోడ్డు పనులకు శంఖుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, మే 1 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సిటిజన్ కాలనీలో 81లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న యుజిడి, అంతర్గత రోడ్లుకు కార్పొరేటర్ శంఖుస్థాపన చేశారు. కాలనీలో నెలకుని అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నామని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. అంతర్గత రోడ్లు సమస్యలు త్వరలోనే తీరనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యదవ్ స్థానికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, మే 1 ప్రభాతవార్త:** నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు జరిగే విధంగా అధికార యంత్రాంగం కృషి చేయాలని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం అల్వాల్ డివిజన్ రామాలయం వీధితో జరుగుతున్న రోడ్డు పునరుద్దరణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ప్రజా ధనం వృదా కాకుండా సంవత్సరాలు పాటు పౌరులు అవసరాలను తీర్చే విధంగా అభివృద్ధి పనులు ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఇందుకు అధికారులు బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రశాంతి, ఎఇ వరుణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఇతరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఉండాలి : ముప్పిడి గోపాల్



సింహా చలంలో పూజలు చేస్తున్న ముప్పిడి గోపాల్

**కంటోన్మెంట్,మే 1 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని, తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలని బోయిన్‌పల్లి మార్కెట్ తొలి చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి గోపాల్ తెలిపారు. సింహాచలంలోని శ్రీవరహలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెం దిన కాంగ్రెస్ నేతలు స్యామ్ సన్ రాజు, నరేశ్, దర్గరవి, వేణుగోపాల్, హన్మంతరావ్, హర్షవర్ధన్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మహేంద్రహిల్స్ గురుకుల పాఠశాలలో 96 శాతం ఉత్తీర్ణత : ప్రిన్సిపాల్ సునీత

**కంటోన్మెంట్,మే 1 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలలో 10వ తరగతిలో 96.26 శాతం బాలికలు ఉతీ_ర్ణులైనట్లు ప్రిన్స్‌పాల్ ఎస్.సునీత తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 80 మంది బాలికలు పరీక్షలు రాయగా 77 మంది బాలికలు ఉత్తీర్ణులైయ్యారన్నారు. ఎస్.మేఘనకు 600కు 569, పి.శివానికి 562,జి.స్పందనకు 560, ఎస్.కావేరి 553, సి.హెచ్. అఖిల 553, బండి నిస్సీకి 552 మార్కులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

## డిసిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయండి

### - కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్



పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్

**అల్వాల్, మే 1 ప్రభాతవార్త:** రాజకీయ పరమైన ప్రేరణతో బిఆర్ఎస్ నేత అనీల్ కిషోర్‌పై అల్వాల్ డిసి పోలీసులకు ఫిర్యాదు చేయడం సమంజసం కాదని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ పేర్కొన్నారు. కానాజీగూడ వద్ద అనుమతి లేకుండా అనీల్ కిషోర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని డిసి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు అనీల్ కిషోర్‌కు నోటీసులు జారీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ డిసి శ్రీనివాస్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ నిర్మాత, భారత రత్న విగ్రహం ఏర్పాటు చేయడం డిసికి తప్పుగా ఉందని ఇది దళిత జాతిని అవమాన పరచడం కాదా అని కార్పొరేటర్ ప్రశ్నించారు. దళిత సమాజం పట్ల డిసి వ్యవహరించిన తీరు సమంజసంగా లేదని తక్షణం ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## భూదాన భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

### -భూదాన యజ్ఞ బోర్డు ఏర్పాటు చేసి పేదలకు భూములు పంపిణి చేయాలి

**సైఫాబాద్, మే 1 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అతిపెద్ద వేల కోట్ల కుంభకోణం భూదాన భూముల కుంభకోణమని, రాష్ట్రంలో గత 10 ఏళ్ళలో జరిగిన భూదాన భూముల అన్యాక్రాంతం, అవకతవకలపై హైకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని అఖిల భారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహదేవ్ విద్రోహి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. భూదాన భూముల విషయంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించాలని, తెలంగాణ భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి రెండేళ్ళలో భూముల పంపిణిని పూర్తి చేయాలని ఆయన కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునురి కృష్ణాగౌడ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వానికి పోర్జరీ పత్రాలు సమర్పించిన కారణంగా భూదాన యజ్ఞ బోర్డు ఛైర్మన్‌గా నియమించబడిన గున్న రాజేందర్‌రెడ్డిని 2015లో నాటి ప్రభుత్వం బర్తరఫ్ చేసిందని, ఈ విషయంపై ఆయన హైకోర్టుకు వెళ్ళగా కోర్టు ఆయన బర్తరఫ్ సరైనదేనని తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. రాజేందర్‌రెడ్డి హాయంలో జరిగిన భూదాన భూముల అక్రమాలకు సంబంధించిన కేసులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందని చెప్పారు. రాజేందర్‌రెడ్డిపై సిబిసిఐడిలో ఉన్న కేసుల విచారణ వేగవంతం చేయాలని కోరారు.

## పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయం : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మే 1 ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేసిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికే దక్కిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం 2వ వార్డులోని రసూల్‌పురలోని సర్కిల్ నెం 8 రేషన్ షాప్ నెం 812లో తెల్ల రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ మే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన్యం ఇస్తుందని, అందు వల్ల దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పేదలకు ఽసన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. హైదరాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందు వల్ల ఈ రోజు నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వల్ల అన్నం తినలేక, కొనలేక ఇబ్బందులు పడ్డారన్నారు. దొడ్డు బియ్యం రీసైక్లింగ్ చేసి గత ప్రభుత్వాలు దందాలకు పాల్పడ్డారని ఆరోపించారు.సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టినందుకు సిఎం రేవంత్ రెడ్డికి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు అభినందనలు తెలిపారు.



2వ వార్డు రసూల్‌పురలో రేషన్‌షాప్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## విద్య కనిపించని కిరీటం లాంటిది : ఎసిపి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, మే 1 ప్రభాతవార్తః**
పేద విద్యార్థులను ఆదుకోడానికి స్వచ్ఛంద సంస్థలు ముదుకు రావాల్సిన అవసరం ఉందని చిలకలగూడ డివిజన్ ఏసీపీ జయపాల్‌రెడ్డి, భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మున్నూరు చందు, కార్యదర్శి బేజాడి కిరణ్‌లు అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండిలో సహయ వేదిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ఇతర వస్తువులు అందజేస్తున్నప్పటికి మరింతగా సహాయం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా విద్యా దానం గొప్పదని, అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌టి కుమార్, మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు సాయినాథ్ మాదిగ, బిజెపి నాయకురాలు భానుమతి, మాజీ కార్పొరేటర్ బండారి లత, లింగిశేటి హనుమంతు మున్నూరుతో పాటు చిన్నారులు, టీచర్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కలతో పాటు కులగణన నిర్వహించాలనే నిర్ణయం అభినందనీయం

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, మే1, ప్రభాతవార్త:** జనాభా లెక్కలతో పాటు కుల గణన కూడా నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించటం అభినందనీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కొనియాడారు. గురువారం హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే అన్ని కులాలను, వర్గాలను గుర్తించి, వారికి సముచిత స్థానం కల్పిస్తేనే పురోగమిస్తామని చంద్రబాబు నాయుడు చేసిన సూచనలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, మంచి నిర్ణయం తీసుకుందని కొనియాడారు. స్థానిక సంస్థల గడువు ముగిసి సంవత్సరం గడిచిపోయినా రాష్ట్ర ప్రభుత్వం ఓటమి భయంతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం తనకు అనుకూలంగా కులగణన చేపడితే, ప్రజలు తిరగబడ్డారని, అప్పుడు మళ్లీ రీసర్వే నిర్వహించారు కానీ ఇప్పటి వరకు కులగణన రిపోర్ట్‌ను బహిర్గతం చేయలేదని గుర్తు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ దేశానికే ఆదర్శమని చెప్పటం విడ్డూరంగా ఉందని, కాంగ్రెస్‌ను ఏ విషయంలో ఆదర్శంగా తీసుకోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు తప్పుడు విధానాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, నిరూపించుకోవాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

### : సుల్తాన్‌బజార్ ట్రేడర్స్




ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి కోరుతూ ర్యాలీ చేపట్టిన ట్రేడర్ అసోసియేషన్

**అఫ్జల్‌గంజ్,మే 1 ప్రభాతవార్త:** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులుజరిపి ప్రాణాలను బలి కొన్న పాక్ ప్రేరిపిత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సుల్తాన్‌బజార్ ట్రేడర్ జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న ర్యాలీ నిర్వహించారు.పాక్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కోఠి ఆంధ్రాబ్యాంకు నుంచి కోఠి, హన్‌మాన్‌టేకిడి,తారకరామ తదితర ప్రాంతాలల్లో ర్యాలీ చేపట్టారు.ఈసందర్భంగా సుల్తాన్‌బజార్ ట్రేడర్స్ జాయింట్ యాక్షన్ కమిటి చైర్మన్ గోవింద్‌రాఠి, అధ్యక్షులు వి.కిషన్ యాదవ్‌లు మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేని పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై కాల్పులు జరిపి ప్రాణాలు తీయడం పిరికిపంద చర్య అన్నారు.ప్రాణాలు కొల్పియిన కుటుంబాలకు తమ ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ ర్యాలీలో మాజీ కార్పొరేటర్ పి.మమత సంతోష్‌గుప్త,గిరిధర్‌లాల్ వ్యాపారులు పాల్గొన్నారు.

## కార్మికులు ఐక్యంగా ఉన్నపుడే డిమాండ్‌లు నెరవేరుతాయి

### -ఎండి ఉమర్‌ఖాన్



జెండాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

**సికింద్రాబాద్, మే 1 ప్రభాతవార్తః**
కార్మికులు ఐక్యంగా ఉన్నపుడే కార్మికులు డిమాండ్‌లు నెరవేర్చుకోగలుగుతామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఉమర్‌ఖాన్ అన్నారు. 139వ మే డే సందర్భంగా చిలకలగూడ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాలలో జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ కార్మికులు, ముఖ్యంగా ఆటో కార్మికులు రోజువారి ఖర్చులకోసం నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆటోల కిరాయిలు కట్టలేక, కుటుంబాన్ని పోషించుకోలేకి అవస్థలు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాని డిమాండ్ చేశారు. నెలల కాలంగా ఇబ్బందులు పడుతున్నా ఒకవైపు ట్రాఫిక్ అధికారులు, మరోవైపు పోలీసులు కూడా కేసులు రాస్తూ మరింత ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. తమ డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ లతీఫ్, హరిదర్శన్, శ్రీనివాస్,

## మోడీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్న ప్రజలు

### -బిజెపి నేత చింతల రామచంద్రారెడ్డి



నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నేతలు చింతల రామచంద్రారెడ్డి,లంకల దీపక్‌రెడ్డి, కేశబోయిన శ్రీధర్ తదితరులు

**హైదరాబాద్, మే1, ప్రభాతవార్త:**
దేశవ్యాప్తంగా జనగణన, కులగణనను చేపడతామని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రకటించడం చారిత్రాత్మకమైన నిర్ణయం అని బిజెపి సీనియర్‌నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు.హిమాయత్‌నగర్‌లో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తమను చూసి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం విడ్డురంగా ఉందని విమర్శించారు. గతంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు కులగణన చేయలేదని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకలదీపక్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకటస్వామి, పందిర్ల ప్రసాద్, రాఘవ రెడ్డి, శ్రావణ్ యాదవ్, నర్సింగ్ ముదిరాజ్, వినయ్, విజయ్, నరహరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**చార్మినార్,మే 1 ప్రభాతవార్త :** చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ఐదు మంది లబ్దిదారులకు గురువారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బోయ నరేష్ రెండు లక్షల నలభై వేల రూపాయల ఐదు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న నరేష్

## బ్యాంకులకు ధీటుగా పోస్ట్ ఆఫీసు సేవలు

### - రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మంచిరేవులలో నూతన పోస్టాఫీస్‌లో ఖాతాదారులకు కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, మే 1 ప్రభాతవార్త :** ఆధునిక పోకడలను ఒంటబట్టించుకొని, బ్యాంకులకు ధీటుగా పోస్ట్ ఆఫీసులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో నూతన పోస్టు కార్యాలయంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలో ఉన్న తమ బంధువులకు ఉత్తరాల ద్వారా క్షేమ సమాచారంను చేరవేసేందుకు పోస్టు కార్యాలయం తొలి నాళ్లలో పని చేసిందన్నారు. ఆ తరువాత మనీయార్డర్ సేవలు అందించిందని, ఇప్పుడు వృద్దులు, వికలాంగులకు పించన్లు అందిస్తుందన్నారు. అలాగే ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్, ఏటీఎం కార్డులు కూడా అందిస్తూ ఖాతాదారులను ఆకట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మాజీ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ ఎంపిపి పాపిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, మాజీ ఎంపిటిసి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది : ఆదం సంతోష్‌కుమార్

**సికింద్రాబాద్, మే 1 ప్రభాతవార్తః**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆహార భద్రత కార్డు కలిగిన పేద కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ జరుపుతోందని సికింద్రాబాద్ కంటెస్టేడ్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ అదం సంతోష్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గములో గురువారం నిరుపేద కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన సన్న బియ్యం పథకం వారికి వరం లాంటిదని అన్నారు. రేషన్‌కార్డులు కలిగిన ప్రతి కుటుంబంలోని సభ్యులకి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందని, గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వలన లబ్ధిదారులు తినేవారు కాదని, అది గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై భారం పడినప్పటికీ సన్న బియ్యం పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. పది సంవత్సరాలు రేషన్ కార్డులు పంపిణీ చేయక పేద కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడ్డాయని ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కార్డులు అందుతాయని పేర్కొన్నారు. కార్డులు కలిగిన వారందరికీ సన్న బియ్యం అందించడం జరుగుతుందని తెలిపారు.పేదలకు సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా అదం సంతోష్‌కుమార్ బౌద్ధనగర్ డివిజన్ సంజీవ పురంలో సన్నబియ్యం లబ్ధిదారు లలిత ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు, వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు సన్న బియ్యం పథకంపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో షకీల్ ఖాన్, డివిజన్ అధ్యక్షులు అనిల్, బ్రహ్మాజీ, అభిషేక్, రవి, జలందర్ రెడ్డి, కిషోర్ యాదవ్, రవి శంకర్, వహీద్, శ్రీనివాస్, బబ్లూ, చక్రి, అబ్బు బాయి, హరి, ప్రభాకర్, రాధ, కల్పన, రమణి, రాంలీలా పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సంతోష్‌కుమార్ తదితరులు

## మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా ప్రకాశ్ ఏకగ్రీవం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:**
జీహెచ్ఎంసీ గుర్తింపు ఎన్నికల్లో పలు సార్లు గెలుపు సాధించి, ఉద్యోగులు, కార్మికుల హక్కుల, ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేసిన దివంగత కార్మిక నేత శంకర్ మృతితో ఖాళీ అయిన భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా సికిందరాబాద్ జోనల్ ప్రెసిడెంట్ జే. ప్రకాశ్ ను బుధవారం యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికుంది. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించిన కార్యవర్గం జే.ప్రకాశ్ ను ఎన్నుకున్నట్లు యూనియన్ జనరల్ సెక్రటరీ అస్రఫ్ ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు అస్రఫ్, శ్రీధర్ మాట్లాడుతూ దశాబ్దాల కాలం పాటు జీహెచ్ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన దివంగత కార్మిక నేత శంకరన్న ఆశయ సాధనకు యూనియన్ లోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జే.ప్రకాశ్ మాట్లాడుతూ కార్మిక నేత శంకర్ తో కలిసి పని చేసిన చక్కటి అనుభవం తనకుందని, దాన్ని వినియోగించుకుని కార్మికులు, ఉద్యోగులకు తనవంత సేవ చేస్తానని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రటరీ అస్రఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ పెంటయ్య, జోనల్ అధ్యక్షులు నర్సింగ్, ఆకుల మోహన్ దాస్, యాదగిరి, గోపాలకృష్ణ, సత్యరాజు, అడిషనల్ జనరల్ సెక్రెటరీ పాండు, సెక్రటరీ బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్‌ను సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు

### యువత రాజకీయాల్లో ఎదిగేందుకు కాంగ్రెస్‌పార్టీయే ఏకైక మార్గం: జగదీశ్వర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, మే1ప్రభాతవార్త**
యువతరం రాజకీయాలల్లో ఎదిగేందుకు కాంగ్రెస్ పార్టీయే ఏకైక మార్గమని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా సమావేశానికి శేరిలింగంపల్లి నియోజక వర్గం నుంచి పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందని ఆయన అన్నారు. అభివృద్దే ప్రధాన లక్ష్యంగా ప్రజలకు, మైనార్టీలకు,బడుగు,బలహీన వర్గాలకు అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీకి సేవచేసిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని , కాంగ్రెస్ పార్టీ ముఖచిత్రం, భారత రాజకీయాల భవిష్యత్తు, దేశం పట్ల దార్శనికత కలిగిన రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం నిజాయితిగా పనిచేసే రాహుల్ గాంధీ అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర నిర్ణయంపై బిసి మహిళ జెఏసి చైర్మన్ జయంతిగౌడ్ హర్షం




తెలంగాణ బిసి మహిళా జేఏసీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ మట్ట జయంతి గౌడ్

**హైదరాబాద్, మే1, ప్రభాతవార్త:**
జనాభా లెక్కల్లో కులగణన చేయాలన్న కేంద్ర నిర్ణయంపై బీసీ మహిళ జేఏసీ చైర్మన్ మట్ట జయంతి గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.గురువారం బిసి మహిళా జేఏసీ సమావేశంలో జయంతిగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాహుల్ గాంధీకి బీసీల అందరి తరపున బీసీల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా బీసీల కల నెరవేర్చినందుకు కృషిచేసిన బీసీ సంఘాలకు సహకరించిన ప్రతి ఒక్కరి తరపున నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల ఆకాంక్ష కోసం పోరాడిన ఉద్యమకారులకు కళాకారులకు మీడియా మిత్రులకు ప్రతి బిసి మహిళా జేఏసీ తరపునమట్ట జయంతి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మీ,మంజు, సుజాత, ఉష తదితరులు తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఇఓ

**నిజాంపేట్, మే 1, ప్రభాతవార్త :** విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ రామక్రిష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం బాచుపల్లి మండలం, నిజాంపేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను బాచుపల్లి మండ విద్యాధికారి ఎంఇఓ రామక్రిష్ణ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఇఓ రామక్రిష్ణ మాట్లాడుతూ సమగ్ర శిక్ష తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా తేదీ: 01.05.2025 నుండి 15.05.2025 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగు తుందని, ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు యోగా, మెడిటేషన్, వ్యాయామ విద్య, చిత్రలేఖనం, పేయింటిగ్, మ్యూజిక్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఫన్ విత్ మాథ్స్, స్పీడ్ మాథ్స్, కంప్యూటర్ బేసిక్స్ మొదలగు వాటిలో నైపుణ్యం గల వాలంటీర్లు శిక్షణ ఇస్తారని తెలిపారు. అంతేకాకుండా ప్రతి రోజు స్నాక్స్ కూడా అందిస్తారని తెలియజేస్తూ మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగించే ఈ కార్యక్ర మాలలో విద్యార్థులు తప్పక పాల్గొనాలని, వీటిని సద్వినియో గం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు రఘునాథ్, ఎస్ఆర్‌పి పర్మగళ్ల నర్సిములు, వాలంటీర్లు లావణ్య, శ్రీదేవి, సుమతి, సరోజ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
క్ర.సం.1. నిట్ నెం: 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ నోటీస్ నిట్ నెం: 06/SE(KZ)/GHMC/TA/2025-2026, తేది: 30.04.2025. పనుల యొక్క సంఖ్య : కోరిన పని-1. మొత్తం సొమ్ము (రూ.లక్షల్లో) 1 పనికి : 1,47,70,650/-. బిడ్ స్వీకరణకు ప్రారంభ /చివరి తేది, బిడ్ దాఖలు ప్రారంభ తేది: 02.05.2025, మ.03.00గం. బిడ్ దాఖలు ముగింపు తేది: 05.05.2025 మ.03.00గం. అధికారి చిరునామా సెల్ నెం: SE(KZ), GHMC, ఫోన్ నెం. 8790522144. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. కమిషనర్.
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్ (KZ), హైదరాబాద్ మహానగర పాలక సంస్థ.
DIPR.NO.1166-PP/CL/ADVT/1/2025-26 తేది: 01.05.2025

IN THE COURT OF THE HON'BLE II Addl. JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA
O.S.No.341 OF 2025
BETWEEN:
1.Mohammed Rafiuddin & Others ..Plaintiffs
AND
1. The MRO Malakajgiri
2. All Concerned ...Defendants
Take Notice that the above named Plaintiffs have filed the above case for Declaration of Legal Status claiming that they are the legal heirs of Late Merajunnisa W/o Mohammed Rafiuddinwho died intestate, against M.R.O Malakajgiri Mandal and also against All Concerned (i.e. Defendant No.2), the same has been posted to 09-01-2025, before the above said court.
If any person/s have got any objection whatsoever in respect of the same may approach the above court on 09-05-2025, at 10.30 A.M., failing which the same shall be decided as per law.
By order of the court
M/s Syed Ashfaq Ahmed
B.Com, LL.M,
Advocates,
#.29-454, First Floor,
Keshav Nagar, Neredmet,
Sec'bad-500056.
Mobile: 9392480056.

బహిరంగ ప్రకటన
సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా క్లైంట్ శ్రీమతి సుజాత W/O. K. రంగారెడ్డి, వయసు సుమారు 49 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: ఇ.నం.1-19, కుంట్లూరు, గణేష్ నగర్ కాలనీ, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-501505, మా క్లైంట్ DOC. NO. 11276/1985, BOOK-I, VOLUME 1726 పేజీలు 385 నుండి 388 తేదీ 10.09.1985 ప్రకారం, అనగా సేల్ డీడ్ ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోగొట్టుకున్నారు.
మా క్లైంట్ DOC. NO. 11276/1985, BOOK-I, VOLUME 1726 పేజీలు 385 నుండి 388 తేదీ 10.09.1985 ప్రకారం, సేల్ డీడ్ అనగా పై ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్‌ను 03.03.2025న సుమారు 12.30 గం. వద్ద ఆ డాక్యుమెంట్‌ను హయత్‌నగర్ P.S. పరిధిలో కుంట్లూరు నుంచి హయత్‌నగర్ ఆటోలో ప్రయణిస్తుండగా ఆ విధంగా పోగొట్టుకున్నారు. ఆ సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినా లేదా దొంగిలింపబడినా మా క్లైంట్‌కు తక్షణమే తిరిగి ఇవ్వవలసినదిగా దిగువ సంతకం దారుడు తెలియజేస్తున్నారు. దానిని ఎవరైనా దుర్వినియోగం చేసినట్లయితే, మా క్లైంట్ చట్టపరంగా న్యాయస్థానం ద్వారా చర్య తీసుకొంటారని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.
సం/- నర్సింహ దూడల
న్యాయవాది
# సన్‌రైజ్ కాలనీ, కుంట్లూరు, అబ్దుల్లాపూర్‌మెట్, R.R. జిల్లా,
ఫోన్: 9848626900 & 8555904743

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, R. R. DISTRICT, AT: HAYATH NAGAR
O.S. No. 266 OF 2025
Between
A. Satyam and others ...Plaintiffs
AND
1. The Thasildhar, Abdullapurmet Mandal, R.R District
2. All Concerned ...Defendants
To,
All Concerned
It is hereby take notice that the plaintiff's herein have filed the above suit in the above mentioned court for declaration of legal heirs and successors of deceased A.Lakshmi who was died on 06-06-2024. The said matter is posted to 09-05-2025 for appearance of any objectionable persons. Therefore it hereby informed that if anybody having interest or claim on the legal heirs of said deceased person may appear in the above-mentioned court by 10:30 A.M., either in person or through an advocate on the above-mentioned date. If you failed to appear before the court, the Hon'ble Court would be decided the matter in your absence.
SCHEDULE OF PROPERTY
All that the land bearing Plot No. 51, admeasuring 133 Sq.yards or its equivalent to 111.18 Sq.Mtrs in Sy.No. 26, situated at Koheda Village, Abdullapurmet Mandal, (formerly under Hayath Nagar Revenue Mandal), under Turkayamjal Municipality, Ranga Reddy District and bounded follows.
NORTH :: Plot No.52
SOUTH :: Plot No.50
EAST :: 20' Wide Road.
WEST :: Plot No.46.
(BY ORDER OF THE COURT)
T. EESHWAR GOUD
ADVOCATES
Office at Plot No.278, Shanthinagar, Hayathangar, Ranga Reddy District
Cell : 8297197166

## గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ



గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపి ,ఎమ్మెల్యే, కార్పొరేటర్, చైర్మన్,

**వనస్థలిపురం. మే.1.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ లోని యన్.జి.వోస్ కాలనీలో 1కోటి 95 లక్షల వ్యయం తో నిర్మించనున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి గురువారం మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్, ఎల్.బి.నగర్,ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి లు గురువారం భూమి పూజ నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా పాత షెడ్డు లో గ్రంథాలయం ఉండడంతో పాఠాకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ జరగడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి,మాజీ కార్పొరేటర్ ముద్ద గౌని లక్ష్మీ ప్రస్సన్న రామ్మోహన్ గౌడ్,బి.జె.పి.అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి,బి.యన్.రెడ్డి నగర్,వనస్థలిపురం డివిజన్ల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,చింతల రవికుమార్,మకుటం సదాశివుడు యన్.జి.వోస్ కాలనీ ప్రతినిధులు పి.వి.కె.సోమయాజులు, జైపాల్ రెడ్డి, పంపన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సఫిలగూడ చెరువులో గుర్రపు డెక్కను తొలగించండి



**నేరెడ్ మెట్, మే 1.ప్రభాతవార్త :** సఫిలగూడ లేక్ లో మరో మారు గుర్రపు డెక్క పనులు చెప్పట్టాలని కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు.ఈ మేరకు జోనల్ కమిసినర్ రవికిరణ్ కి ఇచ్చిన ఫిర్యాదు పై ఉన్నతధికారులు గురువారం చెరువును సందర్శించడం జరిగిందని అయన పేర్కొన్నారు. గుర్రపు డెక్క తీసివేత మాత్రమే కాకుండా పెరగకుండా మైంటైన్స్ టీం ఏర్పాటు చెయ్యాలని, మురుగి నీటి శుద్ధికరణ చెయ్యాలని కార్పొరేటర్ శ్రవణ్ అధికారులను కోరడం జరిగింది. స్పందించిన జోనల్ కమీషనర్ మైంటైనన్స్ కోసం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, ఆసక్తి గలవారు తమకు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో ఏ. ఈ నవీన్, ఏ. ఈ వనజ,రమేష్, వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, ధన్వంత్ తదితరులు

**మలక్ పేట, మే 1, ప్రభాతవార్త:** అంబేద్కర్ బహుజన సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ముప్పిడి ధనవంత్ అధ్వర్యంలో మూసారాంబాగ్ లో జరిగిన మేడే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ప్రొ. డాక్టర్ రియాజ్ ముఖ్యతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్మికులకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని వివరించారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ హక్ కమర్, బోనగిరి చంద్రశేఖర్, ధర్మేందర్, ఆనంద్, వినోద్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు అనంతయ్య , ప్రభాకర్ చారి, భగత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, మే 1, ప్రభాతవార్త:** పెన్షనర్ల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. పెన్షనర్ల కోసం వైద్య శిబిరాలను నిర్వహించారు. అదేవిధంగా 70 సంవత్సరాలు పెన్షనర్లను, 50 సంవత్సరాల వివాహ జీవితం పూర్తి చేసుకున్న దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జనరల్ చోలా ఓం ప్రకాష్ యాదవ్, కోశాధికారి గోరంట్ల ప్రసాద్, సహా అధ్యక్షులు మదన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు:చెరుకు



చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రశాంత్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్

**ఎల్‌బినగర్, మే 1 ప్రభాతవార్త:** మండుతున్న వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెరుకు శంకరయ్యగౌడ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ చెరుకు ప్రవీణ్‌గౌడ్ పేర్కొన్నారు. చెరుకు శంకరయ్యగౌడ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్వర్యంలో నాగోల్ గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రతి రోజు చల్లని మజ్జిగ, మంచినీళ్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకు ప్రశాంత్‌గౌడ్, చెరుకు శివకుమార్‌గౌడ్, చెరుకు గణేష్‌గౌడ్, చెరుకు గణేష్‌గౌడ్, పల్లె సీతారాములు, రావుల రాజుగౌడ్, కందికంటి యెత్తేష్, వెంకటేష్‌గౌడ్, నవనీత్‌గౌడ్ పాల్గొనారు.

# ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు



మే డే నుపురస్కరించుకొని మల్కాజ్గిరిలో సి.పి.ఐ. ఏఐటియుసి ఆధ్వర్యంలో అరుణ పతాకాలు ఎగరవేస్తున్న సీపీ ఐ మండల సహాయ కార్యదర్శి కాసార్ల నాగరాజు,తదితరులు



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలో ఏఐటియుసి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటియుసి నాయకులు



మదర్ డెయిరీ వద్ద మే డే ఉత్సవాల్లో సుదీర్ రెడ్డి, శ్రీకర్ రెడ్డి



మే డే ఉత్సవాల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు



డిజేకేవీ ఆద్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో మాట్లాడుతున్న బొజ్జ రమేష్



లాలాపేటలోని లేబర్ అడ్డా వద్ద జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్న ఎస్సై గంగాధర్



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మల్లెపాక వీరయ్య, కట్టా శ్రీనివాస్, సలావుద్దీన్, శ్రీను, రవి ,చంద్రయ్య, సురేష్



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న కీసరి నర్సిరెడ్డి, రాజకుమార్, లింగంయాదవ్, శేఖర్, చింతపల్లి కృష్ణయ్య



జెండా ఆవిష్కరణలో బాతరాజు నర్సింహ, సామెడి శేఖర్‌రెడ్డి, బోయినపల్లి రాములుగౌడ్, మల్లేష్‌గౌడ్



ఉప్పల్‌లో సిఐటియు జెండా అవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు డిజి నర్సింగ్‌రావు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు

## ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి : సిపి సుధీర్ బాబు



**నేరెడ్ మెట్, మే 1 ప్రభాతవార్త.** రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచ కొండ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారం తో మల్కాజిగిరి జోన్‌లోని నేరెడ్ మెట్ సీపీ కార్యాలయంలో మెగా హెల్త్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. రాచకొండ కమిషనర్, ఆర్కేఎస్సీ చైర్మన్ జి.సుధీర్ బాబు ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా వైద్య సేవలను అందుకున్నారు. అనం తరం రాచకొండ సిపి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల దృష్టి సారించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరంలో మామో గ్రఫీ, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు నోటి క్యాన్సర్ స్క్రీనింగ్తో పాటు ఎక్స్రే మరియు అల్ట్రాసౌండ్ స్కానింగ్తో సహా వివిధ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందించారు. దీనికి అదనంగా, సోలిస్ ఐ కేర్ హాస్పిటల్స్ డిజిటల్ ఉచిత కంటి పరీక్ష అందించగా, సౌజన్య దంత సంరక్షణ ఆసుపత్రులు దంత సంరక్షణకు అవసరమైన పరికరాలు మరియు మౌలిక సదుపాయాలను అందించాయి. డాక్టర్ కె.కల్ప న రఘునాథ్ క్యాన్సర్‌ని ముందుగానే గుర్తించడం, దాని నివారణ చికిత్సా, జీవనశైలి మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మల్కాజ్గిరి డీసీపీలు పద్మజ ఐపీఎస్, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి క్రైమ్స్ అరవింద్ బాబు, ఉమెన్ సేఫ్టీ డిసిపి ఉషా విశ్వనాథ్, డిసిపి అడ్మిన్ ఇంది రా, డిసిపి సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, ఉమెన్ ఫోరం జాయింట్ సెక్రటరీ రాధిక నాథ్, ఆర్కేఎస్సీ చీఫ్ కోఆర్డినే టర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## అబ్బురపరుస్తున్న అష్టలక్ష్మి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న పండితులు

**ఎల్బీనగర్, మే 1 ప్రభాతవార్త:** వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య నిర్వహిస్తున్న అసలలక్ష్మీ దేవాలయం బ్రహ్మోత్సవాలలో గత మూడు రోజులుగా పండుగ వాతావర ణంలో జరుగుతున్న వేడుకలు భక్తులను అబ్బురపరుస్తున్నాయి. ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టిసహిత బ్రహ్మోత్సవములలో భాగంగా నాలుగవ రోజు గురువారం హయగ్రీవఇష్టి, ఉత్సవమూర్తులకు అభిషేకం, పసుపుకొట్టుట, హనుమత్‌సేవ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న వందలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవాలయం ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త, చైర్మన్ సోమ సురేష్ కుమార్, ప్రధానకార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య గుప్తా, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీని వాసు, గౌరీశెట్టి అరుణ్‌కుమార్, చిలుక ఉపేందర్‌రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, మాలే శ్రవణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు కృషి : డా.వెంకటేశ్వర్లు



పోలీస్ కంప్లెయింట్స్ అథారిటీ సభ్యుడు డా.వర్రె వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఆలయ కమిటి అధ్యక్షుడు ఎం.ఎల్.కాంతారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 1 ప్రభాతవార్త :** పోలీసు వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర పోలీస్ కంప్లెయింట్స్ అథారిటి సభ్యుడు డా.వర్రె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం హబ్సిగూడ సంతోషిమాత, సాయిబాబా ఆలయ కమిటి చైర్మన్ ఎం.ఎల్.కాంతారెడ్డి అధ్యక్షతన పలువురు ఆలయ కమిటి నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డా.వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు, పోలీసులకు వారధిగా పనిచేస్తానని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ వన్‌గా నిలిచారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతో మెరుగ్గా ఉన్నాయన్నారు. పోలీసులు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తగు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. హబ్సిగూడ రవీంద్ర నగర్‌లోని సాయిబాబా ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దేవుడి ఆశీస్సులతోనే ఇక్కడి నుంచి తాను ఎన్నో పదవులు అనుభవించానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల కోసం కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో సిఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. హబ్సిగూడ సంతోషిమాత, సాయిబాబా ఆలయ కమిటి చైర్మన్ ఎం.ఎల్.కాంతారెడ్డి మాట్లాడుతూ సాయిబాబా ఆలయం అభివృద్ధికి డా.వర్రె వెంకటేశ్వర్లు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఊయల సాయిబాబా కోసం నిధులు ఇచ్చిన దాతల శిలాఫలకాన్ని అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి వైస్ చైర్మన్ డా.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.సునీల్‌కుమార్, కోశాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, జి.లక్ష్మారెడ్డి, మేనేజర్ సి.వనతి తదితరులు పాల్గొన్నారు.

## స్థలం వివాదంలో ఘర్షణ... పలువురికి గాయాలు

**హయత్ నగర్, మే 1 ప్రభాతవార్త :** కోర్టులో కేసు కొనసాగుతున్న భూమిలో తమకు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని దానిని క్లీన్ చేయడానికి ప్లాట్ల యజమానులు యత్నించగా తమ భూమిలోకి రావద్దంటూ మరో వర్గం వారిని అడ్డు కున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా పలువురికి గాయలయ్యాయి. హయత్ నగర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు... రంగా రెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 951, 952 లోని 7.28 ఎకరాల భూమి గురించి ప్లాట్ ఓనర్లు బద్రిఅశోక్, సత్యనారా యణరెడ్డి, రఘు మరికొంత మందికి మరియు సంరెడ్డి బాల్ రెడ్డి ల మధ్య వివాదం కొనసాగుతోంది. భూయజమానులు కంగుల రాములు, పోచయ్య మరియు మరికొంతమంది కలసి కంగుల గండయ్య మరియు కంగుల ఈదయ్యలకు జీపీఏ చేశారు. వారు అట్టి భూమిని 1970 లో లేఅవుట్ చేసి 170 ఓపెన్ ప్లాట్లుగా మార్చి విక్రయించారు. తరువాత కంగుల వారసులు అంతకుముందు జీపీఏ చట్టబద్ధంగా చెల్లదని ఇట్టి భూమిని 2013 వ సంవత్సరంలో సంరెడ్డి బాల్ రెడ్డికి విక్రయించారు. 2014 నుండి భూమిపై వివాదం కొనసాగుతుంది. ఇటీవల రోడ్లను బ్లాక్ చేసి ఫామ్ హౌస్ కట్టడంపై వచ్చిన పిర్యాదుతో దానిని హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఈ భూమిపై ప్లాట్ యజమానులు 28.03.2025న కోర్టు నుండి ఇంజక్షన్ ఆర్డర్ పొందారు. సంరెడ్డి బాల్ రెడ్డి 19.02.2025 నాడు పోలీసు జోక్యాన్ని నిరోదిస్తూ హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాగ హైకోర్టు పోలీస్, హైడ్రా అధికారులు జోక్యం చేసుకోకుండా ఆర్డర్ ఇవ్వటం జరిగినది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ప్లాట్ యజమానులు సత్యనారాయణ రెడ్డి, బద్రి అశోక్, రఘు, కుమారి, గణేష్, వెంకట్ రెడ్డి మరికొంత మంది తమకు కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ వచ్చిందని తమ ప్లాట్లను శుభ్రం చేయడానికి జెసిబీతో భూమిలోకి ప్రవేశించి ప్లాట్లను క్లీన్ చేస్తుండగా సంరెడ్డి బాల్ రెడ్డి , సంరెడ్డి దిలీప్ రెడ్డి, శీలం శ్రీను వచ్చి ప్లాట్ల యజమానులతో గొడవపడి కర్రలు, రాళ్ళు , గడ్డికోసే కత్తితో కొట్టగా సత్యనారాయణ గారికి తలకు, నవీన్ చిటికన వేలుకు, వెంకటేష్ కి స్వల్ప గాయాలయ్యాయి. ప్లాట్ ఓనర్లు కర్రలు, రాళ్ళతో కొట్టగా సంరెడ్డి బాల్ రెడ్డి తలకు గాయాలయ్యాయి. ఇరు వర్గాల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భర్త ఇంటి ముందు భార్య నిరసన



సామాజిక కార్యకర్తలతో కలిసి భర్త ఇంటి ముందు నిరసన వ్యక్తం చేస్తున్నా భార్య తదితరులు

**మలక్ పేట, మే 1 ప్రభాతవార్త:** మూసారం బాగ్ లోని శాలివాహన నగర్ లో మహిళా సంఘాలు,సామాజిక కార్యకర్తలతో కలిసి భర్త ఇంటి ముందు భార్య నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. పాతబస్తీలోని ఉప్పుగూడకు చెందిన అనూష అనే యువతికి,మలక్ పేట మూసారాం బాగ్ శాలివాహన నగర్లో నివాసం వుండే వినయ్ కుమార్ రావు తో 2018 వివాహం జరిగింది. 2020 లో వీరికి ఓ బాబు సంతానం. బాబుకు అంగవైకల్యం ...అయితే 2022 నుంచి అనూషకు వర కట్నం గా ఇచ్చిన ఆస్తులు అన్ని అమ్మేసి, ఇంకా కట్నం తీసుకునిరావాలని భర్త, భర్త తల్లి వేధిస్తూ ఇంటి నుంచి గెంటివేశారని అనూష తెలిపారు. 2022 లో మలక్ పేట పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసిన తనకు ఎటువంటి న్యాయం జరగలేదని, తిరిగి తనపైనే పోలీసులకు పిర్యాదు చేస్తూ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని,తన కుమారుడిని అప్పగించాలని ఆమె కోరారు. తన కుమారుడి అనారోగ్యం కు చికిత్స కు నెలకు సుమారు పాతిక వేల రూపాయలు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. అసలు బాబు ఆరోగ్య పరిస్థితి తెలియకుండా, చూపించకుండ దాస్తున్నారని,బాబుకు జరగ రానిది జరిగితే బాధ్యులు ఎవరని సామాజిక కార్యకర్తలు ప్రశ్నించారు.

## జిమ్ నిర్మాణం పనులకు శంకుస్థాపన



జిమ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న అరుణసురేందర్‌యాదవ్

**ఎల్‌బినగర్, మే 1 ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జిమ్ నిర్మాణం పనులు చేపడుతున్నామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ సహభావన టౌన్‌షిప్ డీ బ్లాక్‌లోని నూతన ఓపెన్ జిమ్ నిర్మాణం పనులకు గురువారం కార్పొరేటర్ పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ...సహభావన టౌన్‌షిప్ డీ బ్లాక్‌లోని సమస్యలను విడుదలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీ బ్లాక్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో నల్ల బ్యాడ్జీలతో నిరసన



హబ్సిగూడలో ఉగ్రదాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఇందిరా అర్కేడ్ అపార్ట్‌మెంట్‌వాసులు

**ఉప్పల్, మే 1 ప్రభాతవార్త :** పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా హబ్సిగూడలోని ఇందిరా అర్కేడ్ అపార్ట్‌మెంట్ కమిటి ఆధ్వర్యంలో కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కమిటి అధ్యక్షుడు ఇ.నరసింహాచారి, కోశాధికారి జగదీశ్వర్, ఎన్.శాంతికుమార్, రమణరావు, రమేష్, ఎన్ఎస్ఎన్ మూర్తి, ప్రియరంజన్‌దాస్, శ్రీలక్ష్మి, ప్రీత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయకులైన పర్యాటకులను బలి తీసుకున్నారని పేర్కొన్నారు. దీనిని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. ఈ సందర్భంగా పలు ఇళ్లపై నల్ల జెండాలు ఎగురవేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



రామంతాపూర్‌లో ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నిషియన్ కార్యక్రమంలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ తదితరులు

**రామంతాపూర్, మే 1 ప్రభాతవార్త :** ఎలక్ట్రికల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నిషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, సిఎం సహాయనిధి పథకాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా బాల్‌రెడ్డి, రామంతాపూర్ అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందించాలని కోరారు. దీనిపై కాంగ్రెస్ అధినేతలతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు నరేందర్, వెంకటేష్‌గౌడ్, పలువురు కార్మికులు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## కాటేపల్లి బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : గొరిగె మల్లేష్



కాటేపల్లిలో పేలుడులో గాయపడిన వారిని పరామర్శిస్తున్న కురుమ సంఘం నేతలు గొరిగె మల్లేష్ తదితరులు

**ఉప్పల్, మే 1 ప్రభాతవార్త :** యాద్రాద్రి జిల్లా కాటేపల్లిలో జరిగిన ప్రీమియర్ లీగ్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో జరిగిన పేలుడులో గాయపడిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేష్, జన్ని రఘు, గొరిగె పెద్ద మల్లేష్, ఐలయ్య, గణేష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యశోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు కార్మికులను వారు పరామర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో బుగ్గ లింగస్వామి, పులిగిల్ల బర్ల శ్రీకాంత్, కాచారం శ్రీకాంత్ తదితరులు చికిత్స పొందుతున్నారని, వీరికి కంపెనీ యజమాన్యం పూర్తి స్థాయిలో వైద్య ఖర్చులు భరించాలని సూచించారు. బాధితులకు రూ.పది లక్షల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఎండి వెంకయ్యచౌదరితో మాట్లాడి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతి చెందిన వారికి రూ.కోటి పరిహారం, గాయపడిన వారికి పది లక్షలు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పలువురు కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కారు దగ్ధం...

### సురక్షితంగా బయటపడ్డ దంపతులు



**హయత్ నగర్, మే 1 ప్రభాతవార్త:** విజయవాడ జాతీయ రహదారిపై హయత్ నగర్ బస్టాండ్ ఎదురుగా గురువారం సాయంత్రం ఆకస్మాత్తుగా కారులో మంటలు వచ్చి కారు పూర్తిగా దగ్ధం అయ్యింది. వివరాలు... చిట్యాల మండలం వెలిమినేడు నుండి వేణుగోపాల్ రెడ్డి తన భార్యతో కలిసి సాయంత్రం 4.30 గంటల సమయంలో మన్సురాబాద్ వెళ్తున్నాడు. కారు హయత్ నగర్ బస్టాండ్ సమీపంలోకి చేరుకోగానే అకస్మాత్తుగా ముందుభాగం బయ్ నట్ నుండి పొగలు రావడం గమనించారు. అప్రమత్తమై వేణుగోపాల్, అతని భార్య కారు నుంచి దిగి సురక్షతంగా బయటపడ్డారు. కొద్ది సేపట్లో కారులో మంటలు పెద్ద ఎత్తున్న ఎగిసిపాడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకునే లోగా కారు పూర్తిగా దగ్ధం అయ్యింది. దూకాణాల ఎదుట కారు దగ్ధం కావడంతో వ్యాపారులు భయాందోనలకు గురయ్యారు.